RNI NO. TELTEL2010/34557
www.deshatimes.in
దేశ టైమ్స్
DESHA TIMES
తెలుగు దిన పత్రిక
నిజం.. నిర్భయం.. నిరంతరం

దేశ టైమ్స్
DESHA TIMES
16 సంవత్సరాలుగా వెలువడుతున్న "దేశ టైమ్స్" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాలు, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..
సెల్ నెంబర్: 9849758280

నల్గొండ | ఆగస్టు 25 మంగళవారం 2026 | సంపుటి : 16 | సంచిక : 202 | పేజీలు : 4 | వెల రూ. 2.00/- | ఎడిటర్ : సయ్యద్ పాష
NALGONDA | TUESDAY AUGUST 25 2026 | VOL:16 | ISSUE: 202 | PAGES:4 | Rs. 2:00 | EDITOR:SAYED PASHA

# కొండా సురేఖ వ్యవహారంపై సీఎం రేవంత్ రెడ్డి స్పందన

**పార్టీలో ఎవరైనా నిబంధనలు పాటించాల్సిందేనని స్పష్టం**

**సీఎంపై కుమార్తె వ్యాఖ్యలతో కొండా సురేఖకు షోకాజ్ నోటీసు**

**కుమార్తె వ్యాఖ్యలు వ్యక్తిగతమంటూ మంత్రి ఇచ్చిన వివరణ**

తెలంగాణ మంత్రి కొండా సురేఖకు పార్టీ క్రమశిక్షణా సంఘం షోకాజ్ నోటీసు జారీ చేసిన ఉదంతంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. కాంగ్రెస్ పార్టీలో ప్రతి ఒక్కరూ క్రమశిక్షణకు కట్టుబడి ఉండాలని ఆయన స్పష్టం చేశారు. పార్టీ అంతర్గత వ్యవహారాలపై తాను బహిరంగంగా వ్యాఖ్యానించబోనని, క్రమశిక్షణా సంఘమే దీనిపై తగిన నిర్ణయం తీసుకుంటుందని ఆయన వెల్లడించారు. ఇటీవల వరంగల్ జిల్లా గీసుగొండలో నిర్వహించిన మంత్రి కొండా సురేఖ పుట్టినరోజు వేడుకలో ఆమె కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపాయి. సీఎం రేవంత్ రెడ్డితో పాటు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డిని

(మిగతా 2వ పేజీలో..)



## సారంపల్లి మృతి పట్ల కేసీఆర్ సంతాపం



**రైతు సంఘం నేత సారంపల్లి మల్లారెడ్డి కన్నుమూత**

**గొప్ప రైతు ఉద్యమ నాయకుడని కేసీఆర్ కితాబు**

**ఆయన మరణం భారత రైతాంగ పోరాటాలకు తీరని లోటు అని వ్యాఖ్య**

అఖిలభారత రైతు సంఘం నేత, కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి కన్నుమూసిన సంగతి తెలిసిందే. ఆయన మృతి పట్ల బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సారంపల్లి మల్లారెడ్డి తన జీవితకాలమంతా రైతాంగ సమస్యల పరిష్కారం కోసం, వ్యవసాయ రంగం అభివృద్ధి కోసం నిబద్ధతతో పోరాటం చేసిన గొప్ప రైతు ఉద్యమ నాయకుడని కేసీఆర్ కొనియాడారు. ఆయన మరణం భారత రైతాంగ పోరాటాలకు తీరని లోటని పేర్కొన్నారు. మల్లారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

(మిగతా 2వ పేజీలో..)

## రాష్ట్రాల విద్యాశాఖ మంత్రులకు సీజేపీ చీఫ్ అభిజీత్ దీప్కే లేఖ

**అన్ని రాష్ట్రాల విద్యాశాఖ మంత్రులకు కాక్రోచ్ జనతా పార్టీ లేఖ**

**ప్రభుత్వ పాఠశాలలపై రాష్ట్రాల వారీగా సమగ్ర డేటా కోరిన సీజేపీ**

**విద్యా వ్యవస్థలోని లోపాలను సరిదిద్దడమే లక్ష్యమని వెల్లడి**

దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులను మెరుగుపరచడమే లక్ష్యంగా

(మిగతా 2వ పేజీలో..)



## విజయ్ సర్కార్ భారీ ప్రకటనలు.. ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు

**ఏడాదికి 3 ఉచిత ఎల్‌పీజీ సిలిండర్లు అందించనున్న తమిళనాడు ప్రభుత్వం**

**2027 సంక్రాంతి నుంచి 'అన్నపూర్ణి సూపర్ సిక్స్' అమలు**

**రూ.2.5 లక్షల లోపు ఆదాయం ఉన్న కుటుంబాలకు పథకం వర్తింపు**

**మహిళలకు ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణం**

**ట్రాన్స్‌జెండర్లకు ఉచిత బస్సు ప్రయాణం ప్రకటించిన విజయ్**



తమిళనాడు అసెంబ్లీలో ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ సోమవారం పలు కీలక సంక్షేమ పథకాలను ప్రకటించారు. ఏడాదికి మూడు ఉచిత ఎల్‌పీజీ సిలిండర్లు అందించే పథకంతో పాటు ట్రాన్స్‌జెండర్లకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. 'అన్నపూర్ణి సూపర్ సిక్స్' పేరుతో గ్యాస్ సిలిండర్ల పథకం అమల్లోకి రానుంది. 2027 సంక్రాంతి నుంచి దీనిని ప్రారంభించనున్నారు. ఏటా రూ.2.5 లక్షల లోపు

(మిగతా 2వ పేజీలో..)

## ఫుడ్ ప్రాసెసింగ్‌తో పంటలకు విలువ.. ప్రపంచ మార్కెట్లే లక్ష్యం: సీఎం చంద్రబాబు


**దేశీయ పాప్‌కార్న్ విత్తనాలను ఆవిష్కరించిన ఉపరాష్ట్రపతి, సీఎం**

**ఆంధ్రా పాప్‌కార్న్, అరకు కాఫీలను గ్లోబల్ బ్రాండ్లుగా తీర్చిదిద్దడమే లక్ష్యం**

**నదుల అనుసంధానంతో నీటి భద్రత సాధిస్తామన్న చంద్రబాబు**

వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులకు ఫుడ్ ప్రాసెసింగ్ ద్వారా విలువ జోడించి, అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని

(మిగతా 2వ పేజీలో..)



## పరందూర్ ఎయిర్‌పోర్ట్ రద్దు: సీఎం విజయ్ నిర్ణయంపై స్టాలిన్ ఫైర్

**చెన్నై సమీపంలోని పరందూర్ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ ప్రాజెక్టు రద్దు**

**వ్యవసాయ భూములను కాపాడేందుకే ఈ నిర్ణయమన్న సీఎం విజయ్**

**ఇది రాష్ట్ర అభివృద్ధికి పూడ్చలేని నష్టమని విమర్శించిన స్టాలిన్**

**ముఖ్యమంత్రి ప్రకటనకు నిరసనగా అసెంబ్లీ నుంచి డీఎంకే వాకౌట్**

చెన్నై సమీపంలోని పరందూర్ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ ప్రాజెక్టును రద్దు చేస్తున్నట్లు తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ వెల్లడించారు. సాగు భూములు, రైతుల జీవనోపాధిని పరిరక్షించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. అయితే, ప్రభుత్వ చర్యపై డీఎంకే అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ నిర్ణయం రాష్ట్ర అభివృద్ధికి తీరని లోటు అని, తమిళనాడును దశాబ్దాల కాలం వెనక్కి నెడుతుందని విమర్శించారు. సోమవారం తమిళనాడు అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి విజయ్ ఈ ప్రకటన చేశారు. దీనిపై స్టాలిన్ సామాజిక మాధ్యమం 'ఎక్స్' ద్వారా స్పందిస్తూ, "సంకుచిత రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్ర హితాన్ని పణంగా పెట్టవద్దని హితవు పలికారు. సకల ప్రత్యామ్నాయాలను పరిశీలించిన అనంతరమే ఈ ప్రాంతాన్ని ఎంపిక చేశామని, భూసేకరణ దాదాపు తుది దశకు చేరుకున్న తరుణంలో ప్రాజెక్టును రద్దు చేయడం హేతుబద్ధం కాదని పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయం పొరుగున ఉన్న పోటీ రాష్ట్రాలకు 'జాక్‌పాట్'

(మిగతా 2వ పేజీలో..)




## తెలంగాణలో రేపు పాలిటెక్నిక్ కాలేజీల బంద్

**జీవో 97ను వ్యతిరేకిస్తూ ఏబీవీపీ ఆందోళన**

**రేపు రాష్ట్రవ్యాప్తంగా పాలిటెక్నిక్ కాలేజీల బంద్‌కు పిలుపు**

**జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్**

తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 97పై అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఈ జీవోను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ, రేపు (మంగళవారం) రాష్ట్రవ్యాప్త పాలిటెక్నిక్ కళాశాలల




(మిగతా 2వ పేజీలో..)

తెలుగు దినపత్రిక
దేశటైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం

## సంపాదకీయం

# ధరాఘాతంపై సమీక్షించని పాలకులు

పాలక పార్టీలకు రాజకీయాలు తప్ప ప్రజల సమస్యలు పట్టడం లేదు. ఓట్లకోసం పథకాలను తీసుకుని వెళ్లడం, మధ్యతరగతి ప్రజలపై భారం మోపం తప్ప కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల తీరు మారడం లేదు. రాజకీయ పార్టీలు కూడా ఉచిత హామీలపై పాలక పార్టీలను నిలదీయడం తప్ప, ధరలఅపై ధర్నాలు చేసిన సందర్భాలు కనిపించడం లేదు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ గెవలడమెలా అన్న ప్రణాళికలు సిద్దం చేసుకుంటు న్నారు. ఇందుకు అధికారంలో ఉన్న ఏ పార్టీ కూడా మినహాయింపు కాదు. కేంద్రంలోని బిజెపి నేతృత్వం లోని ఎన్‌డిఎ తీరు కూడా అదే విధంగా ఉంది. తాము చేసిందే పాలన అన్న విధంగా ప్రచారం చేసుకుంటు న్నాయి. నిత్యావసర ధరలు మొదలు, సిమెంట్, విమానయాన ధరుల అందనంత ఎత్తుకు పోతున్నాయి. దీంతో పేద మధ్యతరగతి ప్రజలు నకరయాతన పడుతున్నారు. ఒకటని లేకుండా క్రమంగా ధరలు పెంచే స్తున్నారు. చక్కెర, బెల్లం, పూలు, పండ్లు.. ఇలా ప్రతి వస్తువు ధర అమాంతం పెరిగిపోతోంది. ఎల్‌నినో బూచి చూపి ఫైన్ రైస్ రకం బియ్యం అమాంతంగా పెంచేశారు. కిలో 80 రూపాయాలకు బియ్యం ధరలు ఎగబాకాయి. బహిరంగ మార్కెట్లో సన్నరకాల ధాన్యం లభ్యత తగ్గడం..కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు వంటి ఇతర రాష్ట్రాల నుంచి డిమాండ్ పెరగడం, సరఫరా వ్యవస్థలో ఒత్తిడి.. ధరల పెరుగుదలకు కారణాలని మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. మరోవైపు పౌరసరఫరాల సంస్థ అవసరాలకు మించి సేకరించిన ధాన్యం సుమారు 20 లక్షల టన్నుల వరకు ఉండగా..అందులో అధిక మొత్తంలో సన్నాలే ఉన్నాయి. ఈ వడ్లను వేలంలో అమ్మే పక్రియకు స్పందన రాకపోవడంతో సరకంతా మిల్లర్లు, గోదాముల దగ్గరే ఉండటం కూడా మరో కారణమని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. చింతపండు రెండువందలకు పైనే పెరిగింది, చక్కర ధరలు కూడా మెల్లగా పెంచుతూ.. అనూహ్యంగా పెరిగాయి. అందరూ ఫ్రీ దయాబిటిక్ కనుక వీటి ధరలు పెరిగినా ఫర్వాలేదని బీహార్‌కు చెందిన ఓ మంత్రి ఎకసక్కెంగా మాట్లాడారు. నిజానికి పాలకులు చేస్తున్న దుబారా ఖర్చులకు మాత్రం కళ్లెం పడడం లేదు. ఇలా చెప్పుకుంటూ పోతే ఒక్కటేంటి వంటకు,పూజలకు ,పెళ్ళిల్ళ వరకు అవసరమయ్యే అన్ని వస్తువుల ధరలు భగ్గుమంటున్నాయి. ఉల్లిగడ్డ నెలరోజుల్లోనే దాదాపు రెట్టింపైంది. జులై నాలుగో వారంలో కిలో రూ.22-26 ఉంటే.. ఇప్పుడు రూ.45-52కి చేరింది. జూన్ మొదటి వారంతో పోలిస్తే వెల్లుల్లి కిలో ధర రూ.120-130 నుంచి రూ.250 అంటే దాదాపు వంద శాతం వరకు పెరిగింది. ఎండుమిర్చి రూ.240 నుంచి రూ.300కి చేరింది. వంటనూనెల ధరలు కూడా భగ్గుమంటున్నాయి. లీటర్ నూనె ప్యాకెట్ 175కు చేరింది. బెల్లం కేజీకి రూ.55 నుంచి రూ.70-75కి పెరిగింది. పండగలు, శుభాకార్యాల్లో పిండివంటలు తప్పనిసరైన నేపథ్యంలో ఇది మరో భారమైంది. ఇక పెళ్లిళ్లు.. బోనాలు, శ్రావణమాస పూజల నేపథ్యంలో పూలకు గిరాకీ ఏర్పడగా..వ్యాపారులు దాన్ని సొమ్ము చేసుకుంటున్నారు. బోనాలు ఒక్కో ప్రాంతంలో ఒక్కోసారి జరుగుతుండటంతో ఆ సమయాల్లో ప్రాంతాల వారీగా పెంచేస్తు న్నారు. బంగారం ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. కనీసం పుస్తెలు చేయించే పరిస్తితి కూడా లేకుండా పోతోంది. బంగారనం ధరల మాఫియా ప్రపంచాన్ని శాసిస్తోంది. బంగారం షాపుల వారు కల్తీల, తరుగు, జిఎస్టీ పేరుతో దోచేస్తున్నారు. పెళ్లి బడ్జెట్‌లో బంగారం పెద్ద భాగం. పెరిగిన ధరలతో మంగళసూత్రం సహా అభరణాల కొనుగోలు ఖర్చు తలచుకుంటేనే భయమేస్తోందని పెళ్లిళ్లు చేసే కుటుంబాలు ఆవేదన వ్యక్తంచేస్తున్నాయి. ఇక నిత్యం వాడుకునే ఉల్లిగడ్డ ధరలు కూడా అనూహ్యంగా పెరిగాయి. కిలో 45కు తక్కువగా అమ్మడం లేదు. ఇదే కోవలో ఎండుమిర్చి, వెల్లుల్లి ధరలు కూడా భయపెడుతున్నాయి. ఇలా చెప్పకుంటూ పోతే ధరల జాబితా చాంతాండంత తయార వుతోంది. ఇక ఇల్లు కట్టుకునాలనుకునే వారికి సిమెంటు,స్టీలు, ఇటుక, ఇసుక ధరలు చిర్రెత్తిస్తున్నాయి. ఇకపోతే మందుల ధరలు, ఆస్పత్రుల ఖర్చులు చెప్పాల్సిన పనిలేదు. ఇవన్నీ ఒక ఎత్తయితే నిత్యావసర ధరల పెరుగుదల కారణంగా సామాన్యుడి నెలవారీ ఇంటి ఖర్చు అమాంతంగా పెరగడంతో తలపట్టుకునే పరిస్థితి వచ్చింది. అయితే ఉత్పత్తి తగ్గడం, సరఫరా ప్రభావం వంటికారణాలతో వ్యాపారులు రోజుకో లెక్క చెబుతున్నారు. ఇలా ధరలు పెరుగుతున్నా కేంద్ర రాష్ట్రాలు సమీక్షించడం లేదు. ధరల అదుపునకు చర్యలు తీసుకోవడం లేదు. వ్యాపారులను నిలదీయడం లేదు. జనాభాకు తగ్గట్లుగా పంటుల పండుతున్నాయా లేదా అన్నది చూడడం లేదు. దేశంలో ఏయే పంటలు ఎంత పండుతున్నాయి..ఎంతెంత నిల్వాలు ఉంటున్నాయో లెక్కలు వేయడం లేదు. ఏ సరుకు ఎక్కడి నుంచి ఎక్కడికి పోతేందో గమనించడం లేదు. బ్లాక్ మార్కెటీర్లను అదుపు చేయడం లేదు. ఇక విమాన ప్రయాణాన్ని సామాన్యులకు చేరువ చేస్తామిన గొప్పులు చెబుతున్న మోడీ సర్కార్ విమాన ధరలను గమనించడం లేదు. విమాన సంస్థలు మూతపడుతున్నా పట్టించుకోవడం లేదు. ఇలాంటి వారంతా పాలకులుగా ప్రజలకు ఏం సందేశం ఇస్తారో చెప్పాలి. నిరసనలు చేసేవారు ధరల పెరుగుదలపై నిలదీయాలే తప్ప రాజకీయ ప్రయోజానాల కోసం కాదు. విపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ తన బాధ్యతను పూర్తిగా విస్మరించింది. పార్లమెంట్ సమావేశాలను కేవలం ఆందోళనతో భ్రష్టు పట్టించింది. ఇది కూడా ప్రజలపై భారం మోపే చర్య తప్ప మరోటి కాదు. ఇవన్నీ కూడా ప్రజలు గమనించాలి. ప్రజాప్రతినిదులు వచ్చినప్పుడు ప్రలే నిలదీయాలి. అప్పుడైనా చలనం వస్తుందేమో చూడాలి.

# కొండా సురేఖ వ్యవహారంపై సీఎం రేవంత్ రెడ్డి స్పందన

(మొదటి పేజీ తరువాయి)

ఉద్దేశించి ఆమె చేసిన విమర్శలు పార్టీలో తీవ్ర చర్చకు దారితీశాయి. ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్న టీపీసీసీ క్రమశిక్షణా సంఘం, వివరణ కోరుతూ మంత్రి సురేఖకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. షోకాజ్ నోటీసుకు మంత్రి కొండా సురేఖ ఇప్పటికే లిఖితపూర్వక సమాధానం సమర్పించారు. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలు పూర్తిగా ఆమె వ్యక్తిగతమని, ఆ అంశానికి తనను బాధ్యురాలిని చేయవద్దని వివరణలో పేర్కొన్నట్లు సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో, పార్టీ క్రమశిక్షణ విషయంలో ఎవరూ అతీతులు కారని సీఎం రేవంత్ రెడ్డి తేల్చి చెప్పడం రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

# విజయ్ సర్కార్ భారీ ప్రకటనలు.. ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు

(మొదటి పేజీ తరువాయి)

ఆదాయం ఉన్న కుటుంబాలకు ఈ ప్రయోజనం వర్తిస్తుంది. సుమారు 1.30 కోట్ల కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది.అర్హులైన కుటుంబాలు కొనుగోలు చేసే మూడు గ్యాస్ సిలిండర్ల ఖర్చును నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు. ఈ పథకానికి ఏటా సుమారు రూ.4,000 కోట్ల వ్యయం అవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. గల్ఫ్ ప్రాంతంలో కొనసాగుతున్న యుద్ధ పరిస్థితులతో గ్యాస్ కొరత, ధరల పెరుగుదల కుటుంబాలపై అదనపు భారాన్ని మోపాయని విజయ్ తెలిపారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణ పథకం పరిధిని ప్రభుత్వం విస్తరించింది. ఇకపై సాధారణ బస్సులతో పాటు ఎక్స్‌ప్రెస్, ఎల్ఎస్ఎస్, డీలక్స్ బస్సుల్లోనూ మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చు. జిల్లాల మధ్య నడిచే బస్సుల్లోనూ ఈ సదుపాయం కల్పించనున్నారు. 'వెట్రి పయనం' పేరుతో అక్టోబర్ 2 నుంచి ఈ విస్తరణ అమల్లోకి వస్తుంది. ట్రాన్స్‌జెండర్లకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించనున్నట్లు విజయ్ ప్రకటించారు. చెన్నై సమీపంలోని పరందూర్ విమానాశ్రయ ప్రాజెక్టుపై విజయ్ మరోసారి తన వ్యతిరేకతను స్పష్టం చేశారు. ప్రాజెక్టుతో ప్రభావితమయ్యే కుటుంబాల పక్షాన నిలుస్తామని చెప్పారు. ప్రత్యామ్నాయ ప్రాంతాలను ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాలను గుర్తించినట్లు తెలిపారు. ప్రస్తుత మీనంబాక్కం, చెన్నై విమానాశ్రయంలోని కొత్త టెర్మినల్-5 నిర్మించనున్నట్లు కూడా ప్రకటించారు.

## పరందూర్ ఎయిర్‌పోర్ట్ రద్దు: సీఎం విజయ్ నిర్ణయంపై స్టాలిన్ ఫైర్

(మొదటి పేజీ తరువాయి)

వంటిదని, తమిళనాడు యువత ఉపాధి అవకాశాలను దెబ్బతీసే చర్య అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఈ ప్రాజెక్టు కోసం కేటాయించిన 5,369 ఎకరాల్లో సగానికి పైగా సాగు భూములు, జలాశయాలు ఉండటంతో పరందూర్ సహా పరిసర 12 గ్రామాల రైతులు దీర్ఘకాలంగా ఆందోళనలు నిర్వహిస్తున్నారు. రైతుల నిరసనలను పరిగణనలోకి తీసుకుని ప్రాజెక్టును ఉపసంహరించుకుంటున్నట్లు ముఖ్యమంత్రి విజయ్ తెలిపారు. కాగా, నిబంధన 110 కింద సభలో చర్చకు తావు లేకుండా ముఖ్యమంత్రి ఈ ప్రకటన చేయడాన్ని నిరసిస్తూ డీఎంకే శాసనసభ్యులు అసెంబ్లీ నుంచి వాకౌట్ చేశారు.గత డీఎంకే ప్రభుత్వం 2022లో దాదాపు రూ.27,000 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును ప్రకటించింది. పరందూర్ ప్రాజెక్టు రద్దయినప్పటికీ, ప్రస్తుత అందుబాటులో ఉన్న చెన్నై విమానాశ్రయాన్ని విస్తరించడంతో పాటు, మరో అనువైన ప్రాంతంలో కొత్త ఎయిర్‌పోర్ట్ నిర్మాణంపై త్వరలోనే స్పష్టమైన ప్రణాళికను ప్రకటిస్తామని ముఖ్యమంత్రి విజయ్ హామీ ఇచ్చారు.

## ఫుడ్ ప్రాసెసింగ్‌తో పంటలకు విలువ.. ప్రపంచ మార్కెట్లే లక్ష్యం: సీఎం చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఫుడ్ ప్రాసెసింగ్ ప్రక్రియతో ఉత్పత్తుల విలువ పెరిగి, రైతులకు ప్రయోజనం కలగడమే కాకుండా రాష్ట్రంలో సంపద సృష్టి జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. సోమవారం ఏలూరు జిల్లా ముసునూరు వద్ద ఏర్పాటు చేసిన 'గార్మే పాప్ కార్నికా' నాన్-జీఎంఓ హైబ్రీడ్ మొక్కజొన్న విత్తనాలను ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో కలిసి ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. అనంతరం దేశంలోనే అతిపెద్ద పాప్‌కార్న్ ప్రాసెసింగ్ యూనిట్‌ను సందర్శించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో చంద్రబాబు మాట్లాడుతూ.. "రైతులపై ఉన్న ప్రేమతో ఉపరాష్ట్రపతి ఏలూరు జిల్లాకు వచ్చి జన్యుమార్పిడి చేయని మొక్కజొన్న విత్తనాలను ఆవిష్కరించారు. గార్మే పాప్ కార్న్ సంస్థ మన దేశీయ నేలపైనే రైతులతో కలిసి నాన్-జీఎంఓ విత్తనాలను ఉత్పత్తి చేయడం అభినందనీయం. నూజివీడు గడ్డపై పండిన ఈ పాప్‌కార్న్ దేశవిదేశాలకు ఎగుమతి కావడం గర్వకారణం" అని అన్నారు. 17,500 మంది రైతులతో 40 వేల ఎకరాల్లో ఈ పంటను సాగు చేస్తూ, దేశీయ పాప్‌కార్న్ ఉత్పత్తిలో 70 శాతం వాటాను కలిగి ఉండటంపై గార్మె సంస్థను ఆయన ప్రశంసించారు. ఇప్పటివరకు పాప్‌కార్న్ కోసం బ్రెజిల్ వంటి దేశాలపై ఆధారపడ్డామని, ఇకపై ఆ సంపద మన దేశంలోనే ఉంటుందని తెలిపారు.

### రాష్ట్ర సమగ్రాభివృద్ధికి జల భద్రతే కీలకం

రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికల గురించి వివరిస్తూ.. "రాయలసీమను ఉద్యాన పంటల హబ్‌గా మార్చేందుకు కార్యాచరణ సిద్ధం చేశాం. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో రూ.1 లక్ష కోట్ల పెట్టుబడులతో సీమను అభివృద్ధి చేస్తాం. రూ.35 వేల కోట్లతో 36 సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేస్తాం" అని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ నెలాఖరులో వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకు నీరందిస్తామన్నారు. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం ఉన్నప్పటికీ గోదావరి నీటిని కృష్ణా డెల్టాకు తరలించి పంటలను కాపాడామని గుర్తుచేశారు. చింతలపూడి ప్రాజెక్టు పూర్తయితే ఈ ప్రాంత భవిష్యత్తు మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా నదుల అనుసంధానం జరగాలన్నది ఎన్డీఏ ప్రభుత్వ ఆలోచన అని ముఖ్యమంత్రి తెలిపారు. "గోదావరి-కృష్ణా, తుంగభద్ర, పెన్నా-కావేరీ నదుల అనుసంధానంతో 4 రాష్ట్రాల్లో నీటి సమస్యలు తీరతాయి. గంగ, మహానది, గోదావరి నదులను కూడా కలిపితే వేల టీఎంసీల నీటిని సద్వినియోగం చేసుకోవచ్చు. నీటి భద్రత సాధిస్తే దేశాభివృద్ధి అన్‌స్టాపబుల్" అని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నారా లోకేష్, కె. అచ్చెన్నాయుడు, కొలుసు పార్థసారథి, పలువురు ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## రాష్ట్రాల విద్యాశాఖ మంత్రులకు సీజేపీ చీఫ్ అభిజీత్ దీప్కే లేఖ

(మొదటి పేజీ తరువాయి)

'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) సంస్థ కీలక ముందడుగు వేసింది. ఇందులో భాగంగా ఆ సంస్థ ప్రతినిధి అభిజీత్ దీప్కే, అన్ని రాష్ట్రాల విద్యాశాఖ మంత్రులకు లేఖలు రాశారు. విద్యను అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశంగా పరిగణించాలని ఆయన తన లేఖలో విజ్ఞప్తి చేశారు.ప్రభుత్వ పాఠశాలల పనితీరు, మౌలిక సదుపాయాలు, విద్యార్థుల ప్రవేశాలు, ఉపాధ్యాయ ఖాళీలు వంటి కీలక అంశా లకు సంబంధించి రాష్ట్రాల వారీగా సమగ్రమైన, పారదర్శకమైన గణాంకాలను అందజేయాలని అభిజీత్ దీప్కే కోరారు. దేశంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రస్తుత దుస్థితిపై సీజేపీ ఆందోళన వ్యక్తం చేసింది. వివిధ రాష్ట్రాల్లోని పాఠశాలల స్థితిగతు లను బేరీజు వేయడానికి, వ్యవస్థలోని లోపాలను గుర్తించి సరిదిద్దడానికి ఈ సమాచారం ఎంతో దోహదపడుతుందని సంస్థ అభిప్రాయపడింది. వివిధ రాష్ట్రాల నుంచి సేకరించిన ఈ సమాచా రాన్ని విశ్లేషించడం ద్వారా విద్యా వ్యవస్థలో గుణాత్మక మార్పులు తీసుకురావడానికి అవసరమై న చర్యలు చేపట్టవచ్చని అభిజీత్ దీప్కే తన లేఖలో పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యారంగంలో జవాబుదారీ తనం, పారదర్శకతను పెంపొందించడమే ధ్యేయం గా సీజేపీ ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

## తెలంగాణలో రేపు పాలిటెక్నిక్ కాలేజీల బంద్

(మొదటి పేజీ తరువాయి)

బంద్‌కు పిలుపునిచ్చింది. పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి అనుసంధానిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో 97ను ఏబీవీపీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను బలోపేతం చేయాల్సింది పోయి, ఈ నిర్ణయం ద్వారా వాటిని ప్రైవేటీకరించే కుట్ర జరుగుతోందని ఆరోపించింది. ఈ నూతన విధానం వల్ల పాలిటెక్నిక్ విద్యార్థులు బీటెక్‌లో లాటరల్ ఎంట్రీ ద్వారా ప్రవేశం పొందే అవకాశాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే ఈ జీవోను ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్ణయానికి నిరసనగా రేపు చేపట్టనున్న బంద్‌ను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఏబీవీపీ విద్యార్థులకు పిలుపునిచ్చింది.

తెలుగు దినపత్రిక
# దేశ టైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం



# గ్రామకంఠం భూముల సర్వేలో జాప్యం ఎందుకు?

**రెవెన్యూ అధికారుల తీరుపై చొప్పకట్లపాలెం నేతల ఆగ్రహం**

**ఖమ్మం ప్రతినిధి ఆగస్టు 24(దేశ టైమ్స్ )**

మండల పరిధిలోని చొప్పకట్లపాలెం గ్రామకంఠం పరిధిలో ఉన్న ఖాళీ స్థలాలను వెంటనే సర్వే చేసి, హద్దులు నిర్ణయించి గ్రామ పంచాయతీకి అప్పగించాలని ఉపసర్పంచ్ పల్లా కొండలరావు, సీపీఎం నాయకులు బండి శ్రీనివాసరావు, బోయినపల్లి పున్నయ్య, మాజీ సర్పంచ్ బూసి వెంకటేశ్వర్లు, వార్డు సభ్యులు కొండేటి అప్పారావు డిమాండ్ చేశారు. సోమవారం బోనకల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వారు అధికారులకు ఫిర్యాదు చేశారు.గత ఐదు నెలలుగా ఖాళీ స్థలాల సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నప్పటికీ, గ్రామ సభలో తీర్మానం చేసినా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు. దీంతో గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు సాగకపోవడంతో పాటు వివాదాలు తలెత్తుతున్నాయని తెలిపారు.గ్రామంలో వీఓ బిల్డింగ్ మంజూరు కాగా, 46/1 సర్వే నంబర్‌లో నిర్మించాలని గ్రామ పంచాయతీ తీర్మానం చేసి శంకుస్థాపన కూడా చేసిందన్నారు. అయితే ఆ స్థలం వద్దని, పది రోజుల్లో అనువైన మరో స్థలాన్ని చూపిస్తామని మాజీ సర్పంచ్ యర్రంశెట్టి సుబ్బారావు, ఏపీఎం వెంకటేశ్వర్లు సమక్షంలో చెప్పడంతో అంగీకరించినట్లు వివరించారు. అనంతరం 15 రోజుల తర్వాత బిల్డింగ్ నిర్మాణ పనులు ప్రారంభించగా రెవెన్యూ అధికారులు పనులు నిలిపివేయాలని సూచించారని తెలిపారు.ఈ నేపథ్యంలో ఆగస్టు 6న బోనకల్‌లో ఎంపీడీఓ, తహశీల్దార్, ఏపీఎం తదితర అధికారుల సమక్షంలో అఖిలపక్ష నాయకులు, గ్రామ పంచాయతీ పాలకవర్గంతో సమావేశం నిర్వహించారని చెప్పారు. వారం రోజుల్లో




గ్రామానికి వచ్చి సర్వే చేసి ఖాళీ స్థలాలను గ్రామ పంచాయతీకి అప్పగిస్తామని అధికారులు హామీ ఇచ్చారని, అయితే 18 రోజులు గడిచినా ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆరోపించారు.గ్రామానికి మరో వీఓ బిల్డింగ్ కూడా మంజూరైన నేపథ్యంలో ఇకనైనా రెవెన్యూ అధికారులు తక్షణమే సర్వే నిర్వహించి, ఖాళీ స్థలాలను హద్దులతో సహా గ్రామ పంచాయతీకి అప్పగించాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగా గ్రామంలో గొడవలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.గ్రామ పంచాయతీ తీర్మానాలకు విలువ లేకుండా అధికారులు వ్యవహరించడం ప్రజాస్వామ్య విరుద్ధమని అన్నారు. ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఫిర్యాదుపై వార్డు సభ్యులు బోయినపల్లి లక్ష్మి, మార్కపుడి రజిని సంతకాలు చేశారు.

# ఉద్దానం కార్గో ఎయిర్‌పోర్ట్‌కు ప్రజా ప్రయోజనాలే ప్రాధాన్యం

**ప్రభుత్వ భూముల్లోనే ఏర్పాటు చేయాలి**

**జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా డాక్టర్ సిపాన గుణవతి**

**శ్రీకాకుళం, ఆగస్టు 24:**

ఉద్దానం ప్రాంత సమగ్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం కార్గో ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి ప్రతిపాదించడం ప్రజా ప్రయోజనాల కోసం కాని వేలాది మంది రైతులు, ప్రజల జీవనాధారాన్ని దెబ్బతీసే విధంగా ప్రైవేటు వ్యవసాయ భూములను సేకరించి ఎయిర్‌పోర్ట్ నిర్మించాలనే ప్రయత్నాలను మాత్రం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని జాతీయ బీసీ సంక్షేమ సంఘం స్పష్టం చేసింది. సోమవారం నాడు శ్రీకాకుళంలో డాక్టర్ సిపాన గుణవతి ఆధ్వర్యంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఈ సమావేశంలో రాష్ట్ర అడ్వైజర్ ఎస్ జి ప్రసాద్ జిల్లా ఇన్చార్జ్ ఎల్ గోవిందరాజులు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మడ్డు సోమశేఖర్ యాదవ్ జిల్లా ఉపాధ్యక్షుడు వైశ్యరాజు మురళి తదితర నాయకులు పాల్గొన్నారు రేపు ఢిల్లీలో ప్రధానమంత్రి అధ్యక్షతన ఏర్పాటు చేస్తున్నా . ఉద్దానం కార్గో ఎయిర్పోర్ట్ స్థల సేకరణ సమావేశం కోసం ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు.కార్గో ఎయిర్‌పోర్ట్‌కు అవసరమైన స్థల సేకరణ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించగా, శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో స్థలాన్ని గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదించాలని ఆదేశాలు జారీ అయినట్లు సంఘం తెలిపింది. అయితే కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన గడువు దాటి సుమారు రెండేళ్లు గడిచినా ఇప్పటివరకు ఒక నిర్దిష్టమైన, ప్రజలకు ఆమోదయోగ్యమైన స్థలాన్ని ప్రభుత్వం ఖరారు చేయకపోవడం విచారకరమని పేర్కొంది.

ప్రభుత్వ భూములు అందుబాటులో ఉన్నా రైతుల భూములపైనే ఎందుకు దృష్టి?

వజ్రపుకొత్తూరు మండలం నగరాలపల్లిలో సుమారు 1,990 ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉన్నట్లు అధికారిక రికార్డులు సూచిస్తున్నాయని సంఘం తెలిపింది. అలాగే మూలపేటలో షిప్‌యార్డ్ కోసం కేటాయించిన వేలాది ఎకరాల భూమిలో కొంత భూమి వినియోగంలో లేకపోతే, అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములపై ముందుగా సమగ్ర పరిశీలన జరపాలని ప్రధానమంత్రి అధ్యక్షతన జరిగే సమావేశం పరిశీలనలోకి తీసుకోవాలని సంఘం నాయకులు కోరారు ప్రభుత్వానికి చెందిన మిగులు భూములు, వినియోగంలో లేని భూములు, సాంకేతికంగా అనుకూలమైన ప్రత్యామ్నాయ ప్రాంతాలను పరిశీలించకుండా మందస మండల పరిధిలోని సుమారు 20 గ్రామాల ప్రజలను ప్రభావితం చేసే ప్రాంతాన్నే ఎందుకు లక్ష్యంగా చేసుకుంటున్నారో జిల్లా యంత్రాంగం ప్రజలకు స్పష్టంగా వివరించాలని సంఘం కోరింది.

వేలాది మంది రైతుల జీవనాధారాన్ని దెబ్బతీయొద్దు

ప్రతిపాదిత ప్రాంతంలో పుష్కలమైన జల వనరులు, పచ్చని చెట్లు, సహజ వనరులతో పాటు ప్రజలకు అవసరమైన ఆహార పంటలను రైతులు సాగు చేస్తున్నారని, ఈ ప్రాంతంలో నిర్మాణ ప్రజలతోపాటు వన్యమృగ ప్రాణ నష్టం కూడా జరుగుతుందని సంఘం పేర్కొంది. తరతరాలుగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతులు తమ భూములను ఇవ్వడానికి అంగీకరించని పరిస్థితుల్లో బలవంతపు భూసేకరణకు ప్రయత్నించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని తెలిపింది.ఎయిర్‌పోర్ట్ అభివృద్ధి పేరుతో రైతుల జీవనాధారం, సహజ జలాశయాలు, పర్యావరణ వ్యవస్థ దెబ్బతినకుండా “అభివృద్ధి కూడా కావాలి -- ప్రజల హక్కులు, పర్యావరణ పరిరక్షణ కూడా కావాలి” అనే విధానంతో ప్రభుత్వం ముందుకు వెళ్లాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం కోరింది.

2013 భూసేకరణ చట్టంపై అధికారులకు అవగాహన ఉందా?

ప్రాంతంలోని కొంతమంది రైతులను 2013 భూసేకరణ చట్టం ప్రకారం ఖాళీ చేయిస్తామని అధికారులు గతంలో హెచ్చరించినట్లు ఫిర్యాదులు వచ్చాయని సంఘం తెలిపింది. అలాంటి వ్యాఖ్యలు చేయడానికి ముందు సంబంధిత అధికారులు భూసేకరణ, పునరావాసం, న్యాయబద్ధమైన పరిహారం, ప్రజాభిప్రాయం మరియు చట్టపరమైన ప్రక్రియలపై పూర్తి అవగాహన కలిగి ఉన్నారా లేదా అన్నది ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించింది.ప్రజల ఆస్తులు, వ్యవసాయ భూములు, జీవనాధారానికి సంబంధించిన విషయంలో ఎలాంటి నిర్ణయమైనా పారదర్శకంగా, చట్టబద్ధంగా, ప్రజల సమక్షంలో తీసుకోవాలని సంగం డిమాండ్ చేసింది.

పర్యావరణ అనుమతులపై స్పష్టత ఇవ్వాలి

కార్గో ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి ప్రతిపాదిస్తున్న ప్రాంతంలో సహజ జల వనరులు, వ్యవసాయ భూములు, పచ్చదనం, పర్యావరణపరమైన ప్రాధాన్యత కలిగిన ప్రాంతాలు ఉన్న నేపథ్యంలో అవసరమైన పర్యావరణ అధ్యయనాలు, సాంకేతిక సాధ్యతా నివేదికలు, పర్యావరణ అనుమతులు ఎలా పొందుతారో ప్రభుత్వం ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని సంఘం కోరింది.ప్రజల జీవనాధారాన్ని, ప్రకృతిని నాశనం చేసి అభివృద్ధి సాధించడమే నిజమైన అభివృద్ధి కాదని డాక్టర్ గుణవతి అన్నారు.ప్రజల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోవాలి గతంలో డాక్టర్ గుణవతి పర్యవేక్షణలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం నిజ నిర్ధారణ కమిటీ ప్రతిపాదిత ప్రాంతంలో పర్యటించి రైతులు, స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకుందని తెలిపారు. అక్కడి పరిస్థితులను పత్రికల ద్వారా ప్రజలకు, ప్రభుత్వానికి తెలియజేయడంతో పాటు ప్రధానమంత్రి కార్యాలయం (PMO) దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.కార్గో ఎయిర్‌పోర్ట్‌కు వ్యతిరేకత కాదని, ప్రజలకు నష్టం కలగకుండా, సరైన ప్రత్యామ్నాయ స్థలంలో, చట్టబద్ధమైన అనుమతులతో, పారదర్శకంగా ఎయిర్‌పోర్ట్ నిర్మించాలన్నదే తమ డిమాండ్ అని డాక్టర్ గుణవతి స్పష్టం చేశారు.


ప్రభుత్వ అనుమతులు లేకుండా సర్వేలు ఎందుకు?

రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన జీవో లేదా అధికారిక ఉత్తర్వులు జారీ చేయకుండానే జిల్లా కలెక్టర్ కార్యాలయం పరిధిలో అనధికారికంగా సర్వేలు నిర్వహిస్తున్నారనే రైతుల ఆరోపణలపై ప్రభుత్వం వివరణ ఇవ్వాలని సంఘం డిమాండ్ చేసింది.ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్ణయం తీసుకోవాలి.ఉద్దానం ప్రాంత అభివృద్ధికి కార్గో ఎయిర్‌పోర్ట్ అవసరమే అయినప్పటికీ, దాని కోసం వేలాది మంది ప్రజలను నిర్వాసితులను చేయడం, సారవంతమైన వ్యవసాయ భూములను నాశనం చేయడం, సహజ జల వనరులను దెబ్బతీయడం సమంజసం కాదని జాతీయ బీసీ సంక్షేమ సంఘం పేర్కొంది. ప్రజలు పడుతున్న ఇబ్బందులను అధికారులు వ్యవహరిస్తున్న వైఖరిని ఇంతవరకు ఎయిర్పోర్ట్ నిర్మాణంలో ఎందుకు జాప్యం జరిగిందని అంశాలపై ప్రధానమంత్రి అధ్యక్షతన ఈనెల 25వ తేదీ సమావేశం సీరియస్ గా తీసుకోవాలండి సంఘం కోరింది. ఈ ప్రాంత ప్రజలు మత్సకారులు ఆర్థికంగా సామాన్యంగా వెనుకబడిన వర్గాలు ఎక్కువగా ఉన్నారు ఈరోజు దేశానికి పౌర విమానయన శాఖ మంత్రిని గత ఎన్నికల్లో గెలిపించి అందించింది కూడా ఈ ప్రాంత ప్రజలేనని గుర్తించు కోవలసిన అవసరం ఎంత ఉంది. ఎయిర్పోర్ట్ స్థల సేకరణ విషయాన్ని గౌరవ ప్రధానమంత్రి, రాష్ట్ర ముఖ్య మంత్రి ఉన్నతాధికార యంత్రాంగం పరిస్థితులను పరిశీలించి ప్రజలకు చట్టపరమైన ఆస్తి భద్రత కల్పించాలని డాక్టర్ గుణవతి కోరారు.



## 3,400 మంది ఓటర్లకు మూడు బూత్‌లేనా?

## నాలుగో బూత్ ఏర్పాటు చేయాలని వినతి




**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 24 (దేశ టైమ్స్):**

బోనకల్ గ్రామ ంలో సుమా రు 3,400 మంది ఓటర్లు ఉండగా, కేవలం మూడు పోలింగ్ బూత్‌లు మాత్రమే ఉన్నాయ ని, దీంతో ఎన్నికల సమయంలో ఓట ర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని అఖిల పక్ష నాయకులు తెలిపారు. గ్రామానికి నాలుగో పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం మండల కేంద్రంలోని ఎండీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు.బోనకల్ గ్రామంలో ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా పోలింగ్ బూత్‌లు లేకపోవడంతో ఓటింగ్ సమయంలో ఓటర్లు క్యూ లైన్లలో ఎక్కువసేపు వేచి ఉండాల్సి వస్తోందని నాయకులు పేర్కొన్నారు. ఓటర్లకు సౌకర్యంగా ఉండేలా అదనంగా నాలుగో పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా ఇటీవల బీఎల్‌ఓలు ఓటర్ల నుంచి ఎన్యూమరేషన్ ఫారంతో పాటు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలను సేకరించినప్పటికీ, విడుదలైన డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాలో పాత ఫొటోలే ఉన్నాయని తెలిపారు. ఓటర్ల నుంచి సేకరించిన నూతన ఫొటోలను జాబితాలో పొందుపరిచి డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను సవరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు తెల్లాకుల శ్రీనివాసరావు, ఉప్పర శ్రీను, బిల్లా విశ్వనాథం, బీజేపీ నాయకులు గుగులోతు నాగేశ్వరరావు, గంగుల నాగయ్య, బీఆర్ఎస్ నాయకులు చిట్టోజు శ్రీనివాస్ అలియాస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సోంపేట రైతు బజార్‌కు కంచిలి ఏఎంసి అధికారులు, జిల్లా కలెక్టర్ జాప్యం ఎందుకు?

- **నాలుగు రోజుల్లో ఇవ్వాల్సిన నివేదికకు మూడు నెలలు.. నివేదిక అందినా, రెండు నెలలకు పైగా జిల్లా కలెక్టర్ చర్యలు శూన్యం**

**శ్రీకాకుళం, ఆగస్టు 22:**

బడుగు, బలహీన వర్గాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులతో పాటు కంచిలి, కవిటి, సోంపేట మండలాల రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి, మధ్యవర్తులపై ఆధారపడకుండా నేరుగా వినియోగదారులకు విక్రయించే అవకాశం కల్పించేందుకు సోంపేటలో రైతు బజార్ ఏర్పాటు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా కన్వీనర్, సంఘ సేవకురాలు డా. సీపాన గుణవతి కోరారు. శనివారం నాడు ఆమె ఈ విషయం మీడియాకు తెలిపారు. ఈ మేరకు డా. గుణవతి శ్రీకాకుళం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించగా, కలెక్టర్ స్పందించి సోంపేటలో రైతు బజార్ ఏర్పాటు సాధ్యాసాధ్యాలను పరిశీలించి, అవసరమైన అంచనాల నివేదికను నాలుగు రోజుల్లో సమర్పించాలని కంచిలి అగ్రికల్చరల్ మార్కెటింగ్ కమిటీ (ఏఎంసీ) అధికారులను ఆదేశించారు.కలెక్టర్ ఆదేశాల మేరకు ఏఎంసీ అధికారులు డా. గుణవతితో కలిసి సోంపేటలో రైతు బజార్ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని మార్చి 20, 2026న పరిశీలించారు. అయితే నాలుగు రోజుల్లో సమర్పించాల్సిన నివేదికను అధికారులు వెంటనే ఇవ్వకుండా గణనీయమైన జాప్యం చేశారు ఎవరి ఒత్తిడి వలన ఈ జాప్యం జరిగిందో ప్రశ్నార్థంగా మిగిలింది డా. గుణవతి ఆరోపించారు. చివరకు పూర్తి అంచనాలతో కూడిన నివేదికను జూన్ 29, 2026న ఏఎంసి అధికారులు జిల్లా కలెక్టర్‌కు సమర్పించారు.అయితే నివేదిక సమర్పించి దాదాపు రెండు నెలలకు పైగా గడిచినా రైతు బజార్ ఏర్పాటుపై జిల్లా యంత్రాంగం నుంచి తదుపరి చర్యలు కనిపించకపోవడం పట్ల డా. గుణవతి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.“నాలుగు రోజుల్లో నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశిస్తే, దాదాపు మూడు నెలలు ఎందుకు పట్టింది? నివేదిక అందిన తర్వాత కూడా రైతు బజార్ ఏర్పాటుపై ఎందుకు నిర్ణయం తీసుకోలేదు? రైతుల సమస్యపై ప్రభుత్వ విధి విధానాలపై అధికారులు ఎందుకు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు?” అని ఆమె ప్రశ్నించారు.రైతుల పంటలకు స్థానికంగానే మార్కెట్ సదుపాయం కల్పించడం ద్వారా మధ్యవర్తుల దోపిడీని తగ్గించి, రైతులకు మెరుగైన ధర లభించే అవకాశం ఉంటుందని ఆమె పేర్కొన్నారు. ముఖ్యంగా కంచిలి, కవిటి, సోంపేట మండలాలకు ఉపయోగపడే విధంగా సోంపేటలో రైతు బజార్ ఏర్పాటు చేయడం వల్ల చిన్న, సన్నకారు రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని తెలిపారు.రైతు బజార్ ఏర్పాటుపై జిల్లా కలెక్టర్‌కు ఈమెయిల్ ద్వారా, సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు కోరినప్పటికీ తగిన స్పందన లేకపోవడంతో తాజాగా ముఖ్యమంత్రి కార్యాలయాన్ని ఆశ్రయించినట్లు డా. గుణవతి తెలిపారు.ఆమె ముఖ్యమంత్రి కార్యాలయానికి దాఖలు చేసిన సమాచార హక్కు దరఖాస్తులో, కలెక్టర్ ఆదేశాల తేదీ, ఏఎంసీ అధికారులు తీసుకున్న చర్యలు, 29-06-2026న సమర్పించిన పూర్తి అంచనాల నివేదిక, నివేదిక అందిన అనంతరం జిల్లా యంత్రాంగం తీసుకున్న తదుపరి చర్యలు, ఇప్పటివరకు తుది నిర్ణయం ఎందుకు తీసుకోలేదనే విషయానికి సంబంధించిన అధికారిక రికార్డుల వివరాలను కోరారు.“రైతుల సంక్షేమం ప్రభుత్వ బాధ్యత. రైతు బజార్ ఏర్పాటుకు కలెక్టర్ స్థాయిలో స్పందన వచ్చి, అధికారులకు నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ, నివేదిక వచ్చిన తరువాత కూడా కలెక్టర్ ఈ ప్రక్రియను ముందుకు తీసుకువెళ్లకపోవడం పట్ల ఆమె ఆందోళన వ్యక్తపరిచారు . ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు ఈ అంశంపై వెంటనే స్పందించి, రైతు బజార్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి” అని డా. గుణవతి కోరారు.రైతుల ఉత్పత్తులకు స్థానికంగా గిరాకీ కల్పించడంతో పాటు గిట్టుబాటు ధర లభించేలా మార్కెట్ సదుపాయాన్ని త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని ఆమె డిమాండ్ చేశారు. అధికారుల జాప్యానికి బాధ్యులైన వారిపై ఉన్నతస్థాయిలో సమీక్ష జరిపి, రైతు బజార్ ఏర్పాటుకు స్పష్టమైన కాలపరిమితితో చర్యలు చేపట్టాలని ఆమె కోరారు. రైతు బజార్ కోసం ఇచ్చిన హామీలు, ఆదేశాలు, నివేదికలు కాగితాలకే పరిమితం కాకుండా కార్యరూపం దాల్చాలని, లేకపోతే రైతుల ప్రయోజనాల కోసం తదుపరి న్యాయపరమైన మరియు ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాటం కొనసాగిస్తామని డా. గుణవతి స్పష్టం చేశారు.

తెలుగు దినపత్రిక
దేశ టైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం

## యూరియా కోసం మానాల రైతుల ఆవేదన

రుద్రంగి ఆగస్టు24(దేశ టైమ్స్)



రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం ఉమ్మడి మానాల గ్రామాలకు చెందిన రైతులు యూరియా కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యూరి యా కోసం గత పది రోజులుగా రైతు వేదిక వద్దకు వచ్చి ఆన్‌లైన్ బుకింగ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నా బుకింగ్ కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వం ఇచ్చిన పోడు భూముల ప్రొసీడింగ్ కాపీలను చేతబట్టి నిరసన తెలిపారు. పట్టా భూములకు యూరియా ఇస్తున్నప్పుడు పోడు భూముల్లో సాగు చేస్తున్న రైతులకు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. యూరియా అందకపోతే పంటలను ఎలా సాగు చేయాలని అధికారులను నిలదీశారు. పోడు భూముల ప్రొసీడింగ్ కాపీల ఆధారంగా వెంటనే యూరియా అందించాలని రైతులు డిమాండ్ చేశారు.

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి


వలిగొండ : ఆగస్టు 24 (దేశ టైమ్స్)



ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు ముక్కెర్ల యాదయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పిఆర్సి ని ప్రకటించాలని, 6 పెండింగ్ డిఏ లను విడుదల చేయాలని, పెండింగ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఈ నెల 27 న కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, వెంకటయ్య, టి వెంకటయ్య, శ్రీనివాస్, సైదారెడ్డి, శ్రీనివాస్, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

## పజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

వలిగొండ, ఆగస్టు 24 (దేశ టైమ్స్)




మండల స్థాయి ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని స్థానిక ఎంపిడిఓ, నోడల్ అధికారి జలంధర్ రెడ్డి అన్నారు. సోమవారం ప్రభుత్వం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల స్థాయిలో నిర్వహించిన ప్రజావాణిలో మండల స్థాయి అధికారులు పాల్గొన్నారని, బాధితుల నుండి వచ్చిన 5 దరఖాస్తులను సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ పల్లవి, వ్యవసాయ అధికారి అంజనీదేవి, ఎంఈఓ భాస్కర్, వైద్యాధికారి జ్యోతి, ఏఈ సందీప్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఓ ఇంటివాడైన టాలీవుడ్ నటుడు ప్రిన్స్.. న్యూజిలాండ్ లో ఘనంగా వివాహం

టాలీవుడ్ యంగ్ హీరో ప్రిన్స్ సెసిల్ ఓ ఇంటివాడయ్యాడు. తన ప్రియురాలు సాయి ప్రతిమ మెడలో మూడు ముళ్లు వేసి వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టాడు. న్యూజిలాండ్‌లోని వనాకా ప్రాంతంలో అత్యంత సుందరమైన ప్రదేశంలో వీరి వివాహం హిందూ సంప్రదాయ పద్ధతిలో వైభవంగా జరిగింది. ఈ వేడుకకు ఇరు కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే హాజరయ్యారు.వివాహ వేడుకలో వధువు సాయి ప్రతిమ ఎరుపు రంగు పట్టుచీర, సంప్రదాయ ఆభరణాలతో మహారాణిలా మెరిసిపోగా, వరుడు ప్రిన్స్ ఐవరీ కలర్ ప్రింటెడ్ పైజామాలో రాజకుమారుడిలా కనిపించాడు. వీరి పెళ్లికి సంబంధించిన ఫోటోలను సోషల్ మీడియాలో పంచుకోవడంతో, అవి క్షణాల్లో వైరల్ అయ్యాయి. ఈ నూతన జంటకు పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు, నెటిజన్లు శుభాకాంక్షలు తెలుపుతూ కామెంట్లు పెడుతున్నారు.వీరిద్దరి ప్రేమకథ కూడా ఎంతో ఆసక్తికరంగా మొదలైంది. ప్రముఖ నటుడు ప్రియదర్శి ద్వారా ఒక కామన్ ఫ్రెండ్ వివాహ వేడుకలో ప్రిన్స్, సాయి ప్రతిమలకు తొలిసారి పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం స్నేహంగా, ఆపై ప్రేమగా మారి ఇప్పుడు పెళ్లి పీటల వరకు చేరింది.'నీకు నాకు డ్యాష్ డ్యాష్' చిత్రంతో హీరోగా పరిచయమైన ప్రిన్స్, 'బస్ స్టాప్' సినిమాతో యువతలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ తర్వాత 'బిగ్ బాస్ తెలుగు' మొదటి సీజన్‌లో పాల్గొని తెలుగు ప్రేక్షకులకు మరింత చేరువయ్యారు. ఇటీవల 'డీజే టిల్లు', 'స్కంద' వంటి విజయవంతమైన చిత్రాల్లో వైవిధ్యమైన పాత్రలు పోషిస్తూ నటుడిగా తనను తాను నిరూపించుకుంటున్నాడు. ప్రస్తుతం ప్రిన్స్ మరికొన్ని ప్రాజెక్టులతో బిజీగా ఉన్నాడు.





## మిస్ యూనివర్స్ వేదికను సుస్మితా సేన్ తో పంచుకోవడంపై ఊర్వశి రౌతేలా ఎమోషనల్

నటి, మాజీ అందాల రాణి ఊర్వశి రౌతేలా మరోసారి వార్తల్లో నిలిచారు. మిస్ యూనివర్స్ ఇండియా పోటీలకు ఆమె వరుసగా నాలుగోసారి న్యాయనిర్ణేతగా వ్యవహరించి ప్రత్యేకతను చాటుకున్నారు. అయితే, ఈసారి ఈ కార్యక్రమం ఆమెకు వ్యక్తిగతంగా ఎంతో ప్రత్యేకం అయింది. తన కెరీర్ ఎదుగుదలలో కీలక పాత్ర పోషించిన, తన గురువుగా భావించే సుస్మితా సేన్‌తో వేదిక పంచుకోవడంతో ఊర్వశి భావోద్వేగానికి గురయ్యారు.ఈ సందర్భంగా తన గురువు సుస్మితా సేన్‌తో ఉన్న అనుబంధాన్ని ఊర్వశి పంచుకున్నారు. "నా మొదటి మెంటర్, నా గురువు, మన దేశపు తొలి మిస్ యూనివర్స్ సుస్మితా సేన్‌తో ఈ క్షణాలను పంచుకోవడం అనంతమైన ఆనందాన్ని ఇస్తోంది. నాకు ఎగరడానికి రెక్కలిచ్చిన మహిళ ఆమె. సాధారణంగా ఆమె ఎవరికీ అలా చేయరు, కానీ నా పట్టాభిషేకం రోజున స్వయంగా ఆమే నాకు కిరీటాన్ని అలంకరించారు. అది నా జీవితంలో అత్యంత మధురమైన, మరచిపోలేని క్షణాల్లో ఒకటి" అంటూ ఊర్వశి తన ఆనందాన్ని వ్యక్తం చేశారు.సుస్మితా సేన్ తనపై ఉంచిన నమ్మకాన్ని ఎప్పటికీ మర్చిపోలేనని ఊర్వశి తెలిపారు. "ఆమె నాపై ఎందుకు అంత నమ్మకం ఉంచిందో ఇప్పటికీ ఆశ్చర్యంగా ఉంటుంది. కానీ కొన్ని ఆశీర్వాదాలకు వివరణలు ఉండవేమో, వాటిని ఆస్వాదించాలి అంతే. దేవుడికి, నా తల్లిదండ్రులకు, కుటుంబానికి, అభిమానులకు, ముఖ్యంగా నా గురువు సుస్మితకు నేను ఎప్పటికీ రుణపడి ఉంటాను. నా కృతజ్ఞతను మాటల్లో చెప్పలేను. కొన్ని కలలు నెరవేరతాయి, మరికొన్ని ఊహకు మించి ఉంటాయి. ఇది రెండో కోవకు చెందింది" అని ఆమె ఉద్వేగంగా మాట్లాడారు.ఇక ఈ కార్యక్రమంలో ఊర్వశి ధరించిన త్రివర్ణ పతాకం గౌను ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దీని గురించి ఆమె మాట్లాడుతూ, "వరుసగా నాలుగోసారి మిస్ యూనివర్స్ ఇండియాకు జడ్జిగా వ్యవహరించడం ద్వారా ప్రపంచ రికార్డు సృష్టించినట్లు మా టీమ్ చెప్పింది. ఇది నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను. కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'నేను ఇండియన్' అని చెప్పాను. ఇప్పుడు ఈ త్రివర్ణ పతాక గౌనులో మిస్ యూనివర్స్ ఇండియాకు జడ్జిగా వ్యవహరిస్తుంటే, ఆ మాటలకు మరింత అర్థం చేకూరినట్లు అనిపిస్తోంది. భారతీయురాలిగా పుట్టినందుకు గర్వపడుతున్నాను" అని ఊర్వశి తన దేశభక్తిని చాటుకున్నారు.

## ఆత్మకథగా రజనీకాంత్ ప్రస్థానం.. అధికారికంగా ప్రకటించిన కుమార్తె సౌందర్య

సూపర్‌స్టార్ రజనీకాంత్ తన సుదీర్ఘ సినీ ప్రయాణాన్ని, జీవిత అనుభవాలను పుస్తక రూపంలో అభిమానులకు అందించబోతున్నారని ఆయన కుమార్తె, దర్శకురాలు సౌందర్య రజనీకాంత్ వెల్లడించారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆమె... ఆ పుస్తకం తయారీ ప్రాసెస్ చాలా ప్రత్యేకంగా సాగుతోందని తెలిపారు.రజనీకాంత్ ఐదు దశాబ్దాల సినీ ప్రయాణంలోని విజయాలు, వ్యక్తిగత అనుభవాలు, అగ్రస్థానానికి చేరుకునే క్రమంలో ఎదుర్కొన్న సవాళ్లతో ఈ పుస్తకం రూపుదిద్దుకుంటోంది. పరమహంస యోగానంద రాసిన 'ఒక యోగి ఆత్మకథ' పుస్తకంలాగే ఈ పుస్తకం కూడా తరతరాలకు స్ఫూర్తినిస్తుందని సౌందర్య నమ్మకం వ్యక్తం చేశారు.ఒకవేళ తన తండ్రి జీవితాన్ని సినిమాగా తెరకెక్కించే అవకాశం వస్తే అది తనకు అత్యంత ప్రత్యేకమైన విషయమని ఆమె తెలిపారు. సృజనాత్మకతకు స్పష్టత, క్రమశిక్షణ చాలా ముఖ్యమని తన తండ్రి నేర్పించారని పేర్కొన్నారు. ప్రస్తుతం సౌందర్య నిర్మాణంలో నెట్‌ఫ్లిక్స్ కోసం 'లవ్' అనే రొమాంటిక్ తమిళ వెబ్‌సిరీస్ రూపొందుతోంది. బాలాజీ మోహన్ దర్శకత్వం వహిస్తున్న ఈ సిరీస్‌లో అర్జున్ దాస్, ఐశ్వర్య లక్ష్మి ప్రధాన పాత్రలు పోషిస్తుండగా... ఇది అక్టోబరులో నెట్‌ఫ్లిక్స్ వేదికగా విడుదల కానుంది.



Printed, Published and Owned by SAYED PASHA Printed at MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State, Published From: MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State. Editor: SAYED PASHA, RNI No. RNI NO. TEITEL 2010/34557, Cell: 9849758280